## క్లుప్తంగా

### నిరుపేద కుటుంబానికి వితరణ



విరాళాలు సేకరిస్తున్న సంజీవనాయుడు, గ్రామస్తులు

బలిజిపేట: నిరుపేద కుటుంబానికి పెదపెంకి గ్రామస్తులు 15,790 రూపాయలను వితరణగా అందజేశారు. వివరాల్లోకి వెళితే... బలిజిపేట గ్రామానికి చెందిన ఒడ్డు రాము దంపతులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. వీరిది పేద కుటుంబం కావడంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారింది. విషయం తెలుసుకున్న పెదపెంకి గ్రామానికి చెందిన ఈర్ల సంజీవనాయుడు, అల్లు సత్యం, తదితరులు గ్రామస్తుల నుంచి విరాళాలు సేకరించారు. మొత్తం 15,790 రూపాయలు సేకరించి బాధిత కుటుంబానికి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో పెదపెంకి యువత పాల్గొన్నారు.

### పాతపెన్షన్ విధానాన్ని కొనసాగించాలి



బలిజిపేటలో నిరసన తెలియజేస్తున్న ఏపీటీఎఫ్ సభ్యులు

బలిజిపేట: పాతపెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఏపీటీఎఫ్ మండలశాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు బలిజిపేటలో ఏపీటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్‌లు ఓపీఎస్‌కు ప్రత్యామ్నాయం కావని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయకుండా మీనమేషాలు లెక్కిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కంట్రిబ్యూషన్ లేని పెన్షన్ స్కీమ్ అమలుచేయాలని, వన్ నేషన్-వన్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వి.ధనుంజయ, రాష్ట్ర కార్యదర్శి పి.ధనుంజయరావు, బలరాంనాయుడు, శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.


### దృశ్యబాట పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న భంజ్‌దేవ్, తదితరులు

సాలూరు: తెలుగు భాష చాలా గొప్పదని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్‌పీ భంజ్‌దేవ్ అన్నారు. పట్టణంలోని ఆర్య వైశ్య భవన్‌లో సాలూరు సాహితీ మిత్ర బృందం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'దృశ్యబాట' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యిండుపూరి రామనారాయణ మురళీకృష్ణ స్మారక అష్టమ సాహితీ పురస్కారాన్ని ఎస్.కోటకు చెందిన వ్రతాయుడు కాశీ విశ్వనాథం గుమ్మా నాగమంజరి దంపతులకు అందించారు. వ్యాసరచన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, సాహితీ మిత్రబృందం సభ్యులు రామారావు, నారాయణరావు, శరత్‌బాబు, ఎస్‌పీ రాజు, జేబీ తిరుమలాచార్యులు, శేషు, శ్రీనివాస్, గణపతి, చందు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా దేశమ్మతల్లి వారాలు



దేశమ్మతల్లికి మొక్కులు చెల్లించుకుంటున్న గ్రామస్తులు

సాలూరు రూరల్: మండలంలోని దత్తివలస గ్రామంలో ఆదివారం దేశమ్మతల్లి వారాల పండగను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమతో పూజలు చేసి, మొక్కులు చెల్లించారు. ఏటా పంటలు బాగా పండాలని దేశమ్మతల్లికి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ అని గ్రామస్తులు తెలిపారు. అదేవిధంగా గ్రామంలో నిత్యపూజలు అందుకుంటున్న బురదాలమ్మ వారాల పండగను మంగళవారం నిర్వహించనున్నట్లు తెలిపారు.

### పాలస్తీనాపై దాడులు ఆపాలి



నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

పాలకొండ: పాలస్తీన ప్రజలపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను ఆపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య పిలుపుమేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ శాంతికి అమెరికా, నాటో దేశాల సామ్రాజ్యవాదం విఘాతం కలిగిస్తోందని అన్నారు. ఇప్పటి వరకు 40వేల మంది పాలస్తీన పౌరులు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు.

# వారధులు కట్టించిన సారథులు





వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పూర్తయిన కందులపదం వంతెన (ఇన్‌సెట్లో) వంతెన నిర్మాణానికి ముందు కందులపదం పరిసర ప్రాంతాల వరద కష్టాలు(ఫైల్)

సాలూరు:

వర్షం కురిస్తే వందలాది గ్రామాలు జలదిగ్బంధంలోకి వెళ్లిపోయేవి. ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయేవి. ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడిపేవారు. అత్యవసరమ పరిస్థితిలో ధైర్యం చేసి వాగులు దాటేందుకు ప్రయత్నిస్తే ప్రాణాలు పోయేవి. అయితే ఇందంతా 2019కి ముందు పరిస్థితి. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర కృషితో ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కల నెరవేరింది. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పలు ప్రాంతాల్లో వంతెనలు నిర్మించడంతో వరద సమయంలో సురక్షితంగా రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో, నియోజకవర్గంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నాటి కష్టాలను ఈ ప్రాంత ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, నాటి ఉపముఖ్యమంత్రి గిరిజన సంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొర చొరవతోనే తమ కష్టాలు తొలగాయని చర్చించుకుంటున్నారు.

- సాలూరు మండలంలో చిన్నపాటి వర్షానికే గోముఖి నది కందులపదం వంతెన మీదుగా ఉధృతంగా ప్రవహించేది. దీంతో చుట్టుపక్కల సుమారు 50 గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వరద సమయంలో ఈ వంతెన దాటేందుకు ప్రయత్నించిన పలువురు వ్యక్తులతో పాటు జీవాలు మృత్యువాత పడిన దాఖలాలు ఉన్నాయి. 2014-19 మధ్య అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వంలో వంతెన నిర్మాణానికి పలుమార్లు శంకుస్థాపన చేసినా పనులు మాత్రం ప్రారంభించలేదు. ఈ ప్రాంతం ప్రజల కష్టాలను గుర్తించిన రాజన్నదొర వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సుమారు రూ.5.13 కోట్లు ఆర్‌అండ్‌బీ నిధులతో వంతెన నిర్మాణం పూర్తిచేసి, ప్రారంభించారు. దీంతో దశాబ్దాలుగా వేధిస్తున్న వంతెన కష్టాలు తొలగాయని ఈ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేయడంతో పాటు రాజన్నదొరకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తున్నా తమ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోలేదని వారంతా అంటున్నారు.
- పాచిపెంట మండలంలో మోసూరు వంతెన కాంట్రాక్టర్లకు కామధేనువుగా ఉండేది. వర్షం పడితే అక్కడ వంతెన కోతలకు గురవ్వడం.. లక్షలాది రూపాయలు వెచ్చించి తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టం.. మళ్లీ వర్షం పడితే అది పాడవ్వడం.. షరా మాములూగా మారింది. ఇదికూడా రాజన్నదొర ప్రత్యేక చొరవతో సుమారు రూ.8 కోట్లతో పీఆర్ ప్రాజెక్టు ద్వారా నూతన వంతెన నిర్మాణం పూర్తిచేశారు. దీంతో చుట్టుపక్కల ప్రజలు నిశ్చింతంగా తమ గ్రామాలకు రాకపోకలు సాగిస్తున్నారు.

**గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన మరికొన్ని వంతెనలు**

- సుమారు కోటి రుపాయలతో పాచిపెంట మండలం పద్మాపురం నుంచి ఈతమానువలస మధ్యలో బ్రిడ్జి శ్లాబ్ పూర్తయింది.
- సుమారు కోటి రుపాయలతో కొండమోసూరు నుంచి దొరలుద్దండి మధ్యలో బ్రిడ్జి శ్లాబ్ పూర్తయింది.
- సాలూరు మండలం తుండ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి మక్కువ వెళ్లే రోడ్డు మధ్యలో బట్టివలస వద్ద సుమారు కోటి రుపాయలతో బ్రిడ్జి శ్లాబ్ పూర్తయింది.
- సాలూరు, మక్కువ మండలాల మధ్య నంద-తుండ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి సీబిలి మధ్యలో సుమారు కోటి రుపాయలతో నిర్మిస్తున్న బ్రిడ్జి శ్లాబ్ లెవెల్‌లో ఉంది.
- సాంపిగాం, కురుకూటి, ఆలూరు-మోదుగ మధ్య, గుంటబద్ర, లింగాడవలస బ్రిడ్జిలు, నేరెళ్లవలస, వెలగవలస-ములక్కాయవలస బ్రిడ్జి, కాకులతోట వద్ద, పెదపారన్నవలస వద్ద బ్రిడ్జిలు, కాజ్‌వేలు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరు కాగా వీటిలో కొన్ని పూర్తయ్యాయి. మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి.
- సాలూరు మండలం కందులపదం, బట్టివలస, బైపాస్ రోడ్డు బ్రిడ్జి, పాచిపెంట మండలం మోసూరు బ్రిడ్జి, మాతుమూరు, కుంతాం-తుమ్మిగెడ్డ మధ్య వంతెనల నిర్మాణం గత ప్రభుత్వంలో పూర్తయ్యాయి.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో స్థానిక ఎమ్మెల్యేగా ఉన్న పీడిక రాజన్నదొర నియోజకవర్గంలో 8 వంతెనలు మంజూరు చేయించడంతో పాటు నిర్మాణాలు పూర్తిచేశారు.



గత ప్రభుత్వంలో బట్టివలస సమీపంలో నిర్మాణం చేపట్టిన వంతెన(ఫైల్)



గత ప్రభుత్వంలో నిర్మించిన మోసూరు వంతెన



ఈతమానువలస వద్ద నిర్మిస్తున్న వంతెన (ఫైల్)

### రాజన్నదొర పాలనలోనే అభివృద్ధి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రిగా ఉన్న పీడిక రాజన్నదొర నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషిచేశారు. ఆయన హయాంలో మండలంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరిగాయి. దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న వంతెనల సమస్యను తీర్చిన నాయకుడు రాజన్నదొర. ఆయనకు మేమంతా రుణపడి ఉంటాం. – బద్నాన ప్రమీల, ఎంపీపీ, పాచిపెంట మండలం

### రాజన్నదొరకు రుణపడి ఉంటాం



మా మండలంలో వంతెనలు లేక వందల గ్రామాల గిరిజనులు దశాబ్దాల పాటు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి రాజన్నదొర ప్రత్యేక చొరవతో ముమ్మరంగా వంతెనలు నిర్మాణాలు జరిగాయి. మరిన్ని నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. వంతెన సమస్యలు తీర్చడంతో నేడు తుఫాన్ తీవ్రత ఎంత ఉన్నా మా గ్రామాల ప్రజలు నిశ్చింతగా ఉన్నారు. దశాబ్దాల వంతెన సమస్య తీర్చిన రాజన్నదొరకు మేమంతా రుణపడి ఉంటాం.
– దండి శ్రీనివాసరావు, తోణాం పంచాయతీ, సాలూరు మండలం

### మా కల నెరవేర్చిన నాయకులు జగనన్న, రాజన్నదొర

చిన్నపాటి వర్షాలకే మా ప్రాంతంలో రాకపోకలు నిలిచిపోయేవి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి రాజన్నదొర ప్రత్యేక కృషితో మా ప్రాంతంలో వంతెన నిర్మాణం పూర్తయింది. దశాబ్దాల నాటి మా కలను సాకారం చేసిన జగనన్న, రాజన్నదొరలను మా జీవితాంతం గుండెల్లో పెట్టుకుంటాం.
– గండిపల్లి రాము, మోసూరు, పాచిపెంట మండలం

# పని సర్దుబాటుతో అన్యాయం

- ఏపీటీఎఫ్ రాష్ట్ర పరిశీలకుడు చాంద్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్‌బాషా

పార్వతీపురం టౌన్ : పదోన్నతుల బదిలీలు చేపట్టకుండా పనిసర్దుబాటు చేయడం వల్ల ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా పరిశీలకుడు సయ్యద్ చాంద్‌బాషా అన్నారు. ఆదివారం స్థానిక జూనియర్ కళాశాలలో జిల్లా శాఖ అధ్యక్షుడు మహేష్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అనివార్య పరిస్థితుల్లో చేపడుతున్నామని చెబుతున్న వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను మండల స్థాయిలోనే ఆపాలని కోరారు. అలాగే పాఠశాలల్లోని ఖాళీలను విద్యా వలంటీర్లతో భర్తీ చేయాలన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి మాట్లాడుతూ.. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఏకీకృత పెన్షన్ విధానం సరికాదన్నారు. పాత పెన్షన్ స్కీమ్ తప్ప ఇతర పెన్షన్ స్కీమ్‌లను ఆమోదించేది లేదని స్పష్టం చేశారు. కార్యవర్గ సమావేశం అనంతరం రాష్ట్ర సంఘం పిలుపు మేరకు పార్వతీపురం కేంద్రంలో సీపీఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల బాలకృష్ణారావు, రాష్ట్ర కౌన్సిలర్ జి.సూర్యనారాయణ, జిల్లా సబ్ కమిటీ సభ్యులు, 15 మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో హెచ్‌ఎం మృతి



హెచ్‌ఎం దన్నాన తిరుపతిరావు(ఫైల్)

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పారసాం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న దన్నాన తిరుపతిరావు గుండెపోటుతో కన్నుమూశారు. సహచర ఉద్యోగులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతిరావు విజయనగరం తోటపాలెంలో నివాసముంటున్నారు. శనివారం రాత్రి అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన స్వగ్రామమైన పాచిపెంటలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. హెచ్‌ఎం మృతికి ఎంఈఓలు మూర్తి, విజయకుమార్, ఉపాధ్యాయ సిబ్బంది సంతాపం తెలిపారు.

**మాజీ డిప్యూటీ సీఎం సంతాపం**

పాచిపెంట: నెల్లిమర్ల మండలం పరాస జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం దనాన్న తిరుపతిరావు మాస్టారు మృతికి మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఆదివారం సంతాపం తెలియజేశారు. మాస్టారు స్వగ్రామం పాచిపెంట చేరుకుని ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాస్టారు కుటుంబ సభ్యులను ఓదార్చి, అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.



తిరుపతిరావు మాస్టారు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

# నదీ తీర గ్రామాల్లో అప్రమత్తం

జియ్యమ్మవలస:

తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కేవీ సీతారామయ్య సూచించారు. నాగావళి నదీతీర గ్రామాల్లో వరద పరిస్థితిని ఆదివారం ఆయన సమీక్షించారు. బాసంగ గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. నదిలో వరద ప్రవాహం ఎక్కువగా ఉన్నందున ప్రజలు ఎవరూ నదిలో దిగవద్దని కోరారు. వరద ఎక్కువైతే పునరావాస ప్రాంతాలకు తరలిస్తామని, ధైర్యంగా ఉండాలన్నారు.

కొమరాడ: బంగాళాఖాతంలో ఏర్పాడిన వాయుగుండం ప్రభావంతో నాగవళి, జంఝావతి నదుల్లో నీరు పెరగడంతో ఆయా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమంతా ఉండాలని ఎస్‌ఐ కె.నీలకంఠం సూచించారు. కళ్లికోట, దుగ్గి, జంఝావతి రబ్బర్ డ్యాం ప్రాంతాలను ఆదివారం ఆయన సందర్శించారు. వర్షాలు, వరదలపై ప్రజలను అప్రమత్తం చేశారు. వరద ఉధృతి పెరిగితే వెంటనే పునరవాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. జంఝావతిలో వరద ప్రవాహం ఉధృతంగా ఉన్నందున ఎవరూ నదిలో దిగవద్దని హెచ్చరించారు.

వీరఘట్టం: నాగావళి నదిలో నీటి ప్రవాహం పెరుగుతున్నందున తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై జి.కళాధర్ సూచించారు. ఆర్ఐ లక్ష్మునాయుడు, ఈఓపీఆర్‌డీ ఎం.నాగభూషణరావుతో కలిసి ఆదివారం బిటివాడ, పనసనందివాడ, కిమ్మి తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. నదిలో ప్రవాహం పెరుగుతున్నందున ప్రజలు అటువైపు వెళ్లొద్దని, పడవ ప్రయాణాలు చేయొద్దని సూచించారు. వారితో పాటు వీఆర్‌ఓలు గంట సురేష్‌కుమార్, జి.అప్పలనాయుడు తదితరులున్నారు.



గరుగుబిల్లిలో కురిసిన వర్షం

గరుగుబిల్లి: అల్పపీడన ప్రభావంతో మండలంలోని గరుగుబిల్లి, పెద్దూరు, ఉద్దవోలు, రావుపల్లి, ఉల్లిబధ్ర, గొట్టివలస తదితర గ్రామాల్లో ఆదివారం ఓమోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. ఈ వర్షం వరి, గోగు పంటకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు అంటున్నారు. చెరువులు, వాగులలో నీరు చేరడంతో జలకళ సంతరించుకున్నాయి. ఇదిలావుండగా పెద్దూరు, రావుపల్లి, కొత్తపల్లి తదితర గ్రామాల్లోని గెడ్డలో వరదనీరు పెరగడంతో పంటలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

# వైద్య సిబ్బంది అప్రమత్తం

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జగన్ మోహనరావు

సీతానగరం: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి, ప్రజలకు అందుబాటులో ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ టి.జగన్ మోహనరావు ఆదేశించారు. పెదంకలాం పీహెచ్‌సీని ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ రికార్డులో నమోదు చేసిన జ్వర పీడితుల వివరాలపై ఆరా తీసి వారి ఆరోగ్య స్థితిపై క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలన్నారు. పాము, తేలు, తదితర విషపూరిత కీటకాల కాటుకు సంబంధించిన వ్యాక్సిన్లు.. మలేరియా, డెంగీ, డయేరియా వంటి వ్యాధులకు అవసరమైన మందుల లభ్యతపై ఆరా తీశారు. అలాగే వార్డులో బెడ్ల సంఖ్య, టాయిలెట్ గదులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు అవసరమైన వైద్యం అందించాలని సూచించారు.

### ఏరియా ఆస్పత్రికి ఐపీహెచ్‌ఎల్ మంజూరు

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రికి రూ.1.2 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ లేబరోటరీ (ఐపీహెచ్‌ఎల్) మంజూరైంది. రాష్ట్రంలో 13 ఐపీహెచ్‌ఎల్‌లు మంజూరయ్యాయి. ఇందులో పార్వతీపురం మన్యం జిల్లాలో సీతంపేట ఏరియా ఆస్పత్రికి ఒకటి కేటాయించారు. ఐపీహెచ్‌ఎల్ ఏర్పాటుతో సాధారణ రక్త పరీక్షలతో పాటు ఇతర పరీక్షలు చేసేందుకు అవకాశం ఉంటుందని ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు.

# రాజన్నా.. నిన్ను మరువలేమన్నా..



సాలూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి భౌతికంగా దూరమైనా ఆయన గుర్తులు నియోజకవర్గంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. అపర భగీరథుడైన ఆయన ఆశయానికి నిలువెత్తు రూపం పాచిపెంట మండల కేంద్రంలోని పెద్దగెడ్డ జలాశయం. పూర్తిస్థాయి నీటి మట్టంతో రిజర్వాయర్ జలకళ సంతరించుకున్న సందర్భంలో, రిజర్వాయర్ కింద వేల ఎకరాలకు సాగునీరు అంది పచ్చని పైరుల పలకరింపులో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గుర్తులు కనిపిస్తూనే ఉంటాయి. పెద్దగెడ్డ రిజర్వాయర్ పేరు చెప్పగానే ఇక్కడ ప్రజలకు ముందుగా గుర్తుకొచ్చేంది రాజశేఖర్‌రెడ్డే. జలయజ్ఞంలో భాగంగా పాచిపెంట పెద్దగెడ్డ రిజర్వాయర్‌ను నిర్మించారు. ఇక్కడ ప్రజలకు తాగు, సాగునీరు అందించారు. రాజశేఖరరెడ్డి ఆశయానికి అప్పటి ఎమ్మెల్యే రాజన్నదొర కృషి తోడుకావడంతో శరవేగంగా రిజర్వాయర్ నిర్మాణం పూర్తయింది. 2006 సెప్టెంబరులో రాజశేఖర్‌రెడ్డి దీన్ని ప్రారంభించారు. సుమారు రూ.100 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు కుడికాలువ ద్వారా పాచిపెంట, సాలూరు, రామభద్రపురం మండలాలకు చెందిన సుమారు 12 వేల ఎకరాలకు సాగునీరు, సుమారు 96 గ్రామాలకు తాగునీరు అందుతోంది. సాలూరు పట్టణ వాసులకు ఈ రిజర్వాయర్ నుంచి తాగునీరు అందించే పనులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి ఉపముఖ్యమంత్రి రాజన్నదొర ప్రత్యేక చొరవతో అడుగులు పడ్డాయి.



పెద్దగెడ్డ రిజర్వాయర్

**నేడు వైఎస్సార్ వర్ధంతి**

సాలూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమాలు సోమవారం ఉదయం 9 గంటలకు నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్, మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్‌పర్సన్ గిరిరఘులు ఆదివారం తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్ కూడలిలో ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించే ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం, మాజీ గిరిజన సంక్షేమశాఖా మంత్రి పీడిక రాజన్నదొర ముఖ్యఅతిథిగా పాల్గొంటారని వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు.

# రైతన్నా.. ఆందోళన వద్దన్నా..

- అధిక వర్షాలకు నీటమునిగిన పంటపొలాలు
- తెగుళ్లు వ్యాపించే అవకాశం
- సస్యరక్షణ చేపడితే పంట సేఫ్

పాలకొండ రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కొద్ది రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. నదులు, కాలువలు పొంగిపొర్లుతున్నాయి. పంట పొలాలు ముంపునకు గురవడంతో పంట నష్టపోవాల్సి వస్తుందని, దిగుబడిపై ఆ ప్రభావం పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సకాలంలో సస్యరక్షణ చేపట్టడం ద్వారా పంటను కాపాడుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. నెల రోజుల వ్యవధిలో పార్వతీపురం మండలంలో 395.5 మిల్లీమీటర్లు, సాలూరు మండలంలో 131.5 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించింది. ఈ క్రమంలో వరద ముప్పు నుంచి పంటలను ఎలా కాపాడుకోవాలో వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు సూచిస్తున్నారు. రైతుల అసరాల మేరకు యూరియా 3,774 టన్నులు, డీఏపీ 394 టన్నులు రైతు సేవాల కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

**వరిలో రక్షణ చర్యలు**

- శ్రీధృతి, మారుటేరు సాంబ, సాంబమసూరి, స్వర్ణ, ఇంద్ర, అమర వంటి వంటి రకాలు ప్రస్తుతం చిరుపొట్ట దశలో ఉన్నాయి. పంట దశలను బట్టి రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.



పట్టణంలో కురుస్తున్న వర్షం



రాజుపేట వద్ద వరి పొలంలో నిలిచిన నీటిని బయటకు మళ్లిస్తున్న రైతు

- పెరుగుదల దశలో ఉన్న వరిపైరు నీటి ముంపునకు గురైతే పొలంలో ఉన్న నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపించాలి.
- ఎకరానికి 25 కిలోల యూరియా, 15 కిలోల పోటాష్ ఎరువును పైపాటుగా అధికారుల సూచనల మేరకు వెసుకోవాలి. లేకుంటే (19:19:19) లీటరుకు 5 గ్రాముల వంతున ఎకరాలకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- ప్రస్తుత వర్షాలకు వరిలో పాముపొడ తెగులు ఉధృతి ఎక్కువయ్యేందుకు అవకాశం ఉంది. దీని నివారణకు ప్రోపికోనజోల్ 1 మి.లీ, లేక వాలిడామైసిన్ 2 మి.లీ, లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి దుబ్బుకి తగిలేలా 15 రోజులు వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.
- వరిలో అగ్గి తెగులు సోకినపుడు ముదురు ఆకులపై నూలుకండే ఆకారంలో గోధుమ రంగు మచ్చలు వచ్చి ఆకులు ఎరబ్రడతాయి. క్రమేపి మచ్చలు కలిసిపోయి. పంట ఎండిపోయినట్లు కనిపిస్తుంది. దీని నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రా. లేదా కాసుగామైసిన్ 2.మి.లీ. మందు లీట రు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అగ్గి తెగులు, పాడ తెగులు కలిపి ఆశించినపుడు ట్రైపాక్సిస్ట్రోబిన్+టేబ్యుకోనజోల్ 0.4 గ్రా. చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- వరిలో సుడిదోమ ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు బుప్రోఫెజిన్ 1.6 మి.లీ. లేదా ఇసోఫెన్ప్రాక్స్ 2 మి.లీ లేదా ఎసిపెట్ 1.5 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ. లేదా థయోమిథోక్సామ్ 0.20 గ్రా. లేదా డైనోటెఫ్యూరాన్ 0.25 గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.